క్లుప్తంగా

జెడ్పీ హైస్కూల్లో డిజిటల్ బోధన షురూ..



జరుగుమల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ విద్యాబోధనను హెచ్ఎం శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. డిజిటల్ తరగతులపై బాలబాలికలు ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు జయంతి బాబు, అరుణ కుమారి, ఎస్.సుబ్బారావు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరు సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.సుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

450 మందికి రక్త పరీక్షలు

వలేటివారిపాలెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 450 మంది విద్యార్థులకు పరీక్షలు చేసినట్లు సీహెచ్ఓ శివరామయ్య తెలిపారు. రక్తం తక్కువగా ఉన్న విద్యార్థులకు వారానికి రెండు సార్లు టెస్టులు నిర్వహిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి, విజయకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

కనిగిరి రూరల్: మండలంలోని బల్లిపల్లి గ్రామ పంచాయతీలోని విశ్వనాథపురంలో గ్యాస్ లీకేజ్ జరిగి పేలుడు సంభవించింది. దీంతో ఒక్కల కొండయ్య ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనను పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి పి.శ్రీను, వీఆర్ఓ, సర్వేయర్ పరిశీలించారు. బాధితులకు దంతులూరి కరుణాకర్ వ్యక్తి గతంగా రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. గ్రామస్తులు లక్కిరెడ్డి రామిరెడ్డి, కోటంశెట్టి పెద్ద నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

సీసీరోడ్ నిర్మాణ పనుల పరిశీలన

మర్రిపూడి: మండలంలోని గార్లపేట పంచాయతీ నర్సాపురం గ్రామంలో నూతన సిమెంట్ రోడ్ నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఏఈ జాలయ్య మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.6 లక్షల సీఎండీఎఫ్ నిధులతో 100 మీటర్ల మేర నూతన సిమెంట్ రోడ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ అల్లాటిపల్లి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దిండు నర్సింహారావు తదితరులు ఉన్నారు.

ఏపీ ఎన్జీఓల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: ఏపీ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21,22 తేదీల్లో విజయవాడలో జరిగే 21వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు తగు న్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రమణారెడ్డి, నాని, మల్లికార్జున రావు, మధు, రాంప్రసాద్, బత్తుల వెంకటసుబ్బయ్య, సరస్వతి పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): ఏపీ ఎన్జీఓల సంఘ 21వ మహాసభల వాల్‌పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు కదిరి బాబురావు శీలంవారిపల్లెలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏపీఎన్జీఓ సంఘ అధ్యక్షుడు పులి రమణారెడ్డి, కార్యదర్శి సింగంపల్లి నరసింహారావు, ఉపాధ్యక్షుడు ఎస్‌కే.రషీద్‌బాషా, ఎస్‌కే.హజరత్‌అలి, మహిళాధ్యక్షురాలు జీవీ అరవింద, సింగంపల్లి రాంప్రసాదు, రవీంద్ర, మహేష్ పలువురు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి



ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ జమీఉల్లా

సింగరాయకొండ: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని స్టేజ్-1 ఎన్నికల అధికారులకు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల విధులపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు సర్పంచ్, వార్డులకు సంబంధించి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎంపీడీఓ తెలిపారు.

ఓటర్ వెరిఫికేషన్ 60 శాతం పూర్తి

- బీఎల్ఓలు, సూపర్‌వైజర్ సమన్వయంతో పనిచేయాలి
- ఆర్డీఓ అజయ్‌కుమార్



ఓటర్ల పరిశీలనపై బీఎల్ఓలతో సమీక్షిస్తున్న ఆర్డీఓ అజయ్‌కుమార్

పామూరు: డివిజన్ పరిధిలో ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం 60 శాతం పూర్తయిందని, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కనిగిరి ఆర్డీఓ తోట అజయ్‌కుమార్ అన్నారు. పామూరులో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ ఆవుల సురేష్‌తో కలిసి మంగళవారం రాత్రి పామూరులోని 270, 276, 277 పోలింగ్‌బూత్‌లలోని పలు నివాసాలకు వెళ్లి ఇంటింటికీ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమ తీరుతెన్నులపై క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు సమగ్ర, వాస్తవ ఓటరుజాబితా రూపకల్పన కోసం విధిగా ఓటరు జాబితాలోని ఓటర్ల ఇంటికివెళ్లి ఓటర్లను కలిసి వివరాలు తీసుకోవాలన్నారు. అదే విధంగా తప్పులు, సవరణలు, ఫొటో మార్పులు, మృతుల వివరాలు ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి ఓటరుకు ఆధార్ నంబర్‌ను సేకరించాలని విధిలేని పరిస్థితుల్లో మాత్రమే ఇతర గుర్తింపు కార్డువివరాలు సేకరించాలన్నారు. శాశ్వత మైగ్రేషన్, మృతుల ఓట్ల తొలగింపులో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమం యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. 18 ఏళ్లు నిండిన వారి ఓటు నమోదు చేయాలని, వారి నుంచి కచ్చితంగా ఆధార్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ ఆవుల సురేష్, ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, సయ్యద్ ఖాజాషరీఫ్, యం.సురేష్, గాయత్రి, అహ్మద్‌రఫీ, ఖాజారఫీ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహం

కొండపి: స్వయం సహాయక సంఘాలల్లోని ప్రతి మహిళ ప్రభుత్వ సహకారంతో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జీవనోపాధుల డీపీఎం డేవిడ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలు, ఆహార ఉత్పత్తులకు సంబంధించి యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి సహకారం అందిస్తోందన్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీలకు జగనన్న బడుగు వికాసం పథకం కింద వాహనాలు కొనుగోలు చేసుకోవడానికి 45 శాతం సబ్సిడీతో బ్యాంక్ రుణాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల నుండి వచ్చిన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఐకేపీ ఏపీఎం సనిత తెలిపారు. కొండపి మండలం నుంచి 75, మర్రిపూడి మండలం నుంచి 60, పొన్నలూరు మండలం నుంచి 83 యూనిట్ల కోసం దరఖాస్తులు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో మూడు మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం కృషి

టంగుటూరు: ప్రభుత్వం మహిళాభివృద్ధికి కృషి చేస్తోందని కొండపి ఏరియా కోఆర్డినేటర్ పెనుమాల సనిత అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు సబ్సిడీ రుణాల కోసం మంగళవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టంగుటూరు నుంచి 140, సింగరాయకొండ నుంచి 60, జరుగుమల్లి నుంచి 50 అర్జీలు అందాయి. అర్జీలను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు డేవిడ్, సుబ్బారావు, టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల ఏపీఎంలు హనుమంతురావు, జయరాజు, భాగ్యలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.



టంగుటూరులో మాట్లాడుతున్న డీపీఎం డేవిడ్

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



జరుగుమల్లి బాలికల వసతి గృహంలో డీడీటీ పిచికారీ



సింగరాయకొండ గురుకుల పాఠశాలలో

జరుగుమల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రత పాటించాలని కందుకూరు సబ్ యూనిట్ కార్యాలయం అధికారి జి.విజయచంద్ సూచించారు. జరుగుమల్లిలో బాలికల వసతి గృహంలోని 9 గదుల్లో మంగళవారం డీడీటీ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా విజయచంద్ మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, చికున్ గునియా, బోదకాలు లాంటి వ్యాధులను డీడీటీతో అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ రాగలక్ష్మి, సామాజిక ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం దైవతీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సింగరాయకొండ: విద్యార్థినులు దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ యూనిట్ అధికారి చందు సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం డీడీటీ పిచికారీ చేయించారు. దోమతెరలు వాడుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌అలీ, ప్రిన్సిపాల్ రమాదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భార్యకు ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సొసైటీ చైర్మన్

సింగరాయకొండ: స్థానిక కనుమళ్ల సహకార సొసైటీలో పంట రుణం తీసుకున్న రైతు మరణించడంతో ఆయన భార్యకు మంగళవారం ఇన్సూరెన్స్ చెక్కు అందజేశారు. కలికవాయ గ్రామానికి చెందిన నల్లపురెడ్డి రామిరెడ్డి 2020–21వ సంవత్సరంలో సొసైటీ ద్వారా పంట రుణం రూ.86 వేలు తీసుకున్నారు. ఆయన గత ఏడాది మార్చిలో మరణించడం, పంట రుణంపై ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా చెల్లించి ఉండటంతో ఆయనకు రూ.లక్ష రూపాయలు ఇన్సూరెన్స్ మొత్తం వచ్చింది. సంబంధిత చెక్కును రైతు భార్య రమాదేవికి సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు అందజేశారు. కోఆపరేటివ్ బ్యాంకు బ్రాంచ్ ఏజీఎం జమీల్‌బాషా, బ్రాంచి మేనేజర్ వై.మోహన్ రావు, అసిస్టెంట్ మేనేజర్ కె.మాధవరావు, సొసైటీ సీఈఓ కాకు రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు



జగనన్న పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న నాయకులు

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ మత్స్య సహకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓగూరి ఏడుకొండలు, మైనారిటీసెల్ నాయకుడు షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. పామూరు కాపువీధి అంగన్‌వాడీ కేంద్రం, విరువూరురోడ్డు, గోపాలపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గర్భిణులు, బాలింతలకు జగనన్న పౌష్టికాహారం పంపిణీ చేశారు. పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా బిడ్డ ఎదుగుదల, గర్భిణులు, బాలింతల్లో మెరుగైన ఆరోగ్యం సాధ్యమవుతున్నదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు యాటా రాఘవేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, మాధురి, రూహి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

9 నుంచి ఆజాది కా అమృత్ మహోత్సవ్

వెలిగండ్ల: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆజాది కా అమృత్ వేడుకలను ఈ నెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అన్ని పంచాయతీలు, మండల ప్రధాన కార్యాలయాల్లో నిర్వహించాలని ఎంపీడీఓ టి.సుకుమార్ మంగళవారం తెలిపారు. శిలా ఫలకాల ఏర్పాటు, భూమికి వందనం, పంచప్రాణ్ ప్రతిజ్ఞ, సెల్ఫీలను అప్‌లోడ్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

పీసీపల్లి: మండలంలో ఈనెల 9 నుంచి 30 వరకు ఆజాది కా అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయా తేదీల్లో ఏ ఏ గ్రామాల్లో ఏ కార్యక్రమాలు నిర్వహించాలో వంటి షెడ్యూల్ విడుదల చేశారు. కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్పెంటర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నరసింహారావు భార్యకు కిసాన్ వికాస పత్రాన్ని అందిస్తున్న చల్లా రామకృష్ణ

టంగుటూరు: టంగుటూరు మండలం కొణిజేడు గ్రామంలో చాకలిమాన్యం వద్ద కొన్ని రోజుల క్రితం సంభవించిన ట్రాక్టర్ ప్రమాదంలో గ్రామానికి చెందిన కార్పెంటర్ జక్కుల నరసింహారావు మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రకాశం జిల్లా కార్పెంటర్స్ అసోసియేషన్ తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. నరసింహారావు కుమార్తె జక్కుల అశ్విత పేరున పోస్టాఫీసులో కిసాన్ వికాస పత్ర పథకంలో నగదు జమ చేసి సంబంధిత పత్రాన్ని భార్య జ్యోత్స్నకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా రామకృష్ణ, కార్యదర్శి దర్గా జానీబాషా, ట్రెజరర్ సాంబ కృష్ణమోహన్, బుర్రా సుబ్బారావు, దేపూరి పిచ్చయ్య, గాదాసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సహాయమడిగితే మోసం చేశాడు!

- ఏటీఎం కార్డు మార్చి నగదు కాజేసిన ప్రబుద్ధుడు
- లబోదిబోమన్న లారీ క్లీనర్

సింగరాయకొండ: ఏటీఎంలో డబ్బు తీసుకోవడానికి సాయమడిగిన వ్యక్తిని అమాయకుడిని చేసి కార్డు మార్చేసి మోసం చేసిన ఉదంతమిది. వివరాలు.. కందుకూరు మండలం పలుకూరు గ్రామానికి చెందిన పేముల నాగరాజు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి డబ్బు అవసరం కావడంతో సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లాడు. కానీ డబ్బు ఎలా డ్రా చేయాలో తెలియని నాగరాజు.. అక్కడే హెల్మెట్ ధరించి ఉన్న వ్యక్తిని సహాయం చేయమని అడిగాడు. దీంతో ఇదే అదనుగా ఆ వ్యక్తి నాగరాజు ఇచ్చిన ఏటీఎం కార్డును మార్చి వేరే కార్డు పెట్టి డబ్బులు రావడం లేదని నమ్మించాడు. వెంటనే అక్కడ నుంచి ఉడాయించాడు. ఓ గంట తర్వాత నాగరాజు సెల్‌ఫోన్‌కు మూడు దఫాలుగా 26,400 రూపాయలు తన ఖాతా నుంచి డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన నాగరాజు వెంటనే కందుకూరులోని ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకుని పరిశీలించగా ఉలవపాడులోని ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.9,500, రూ.9,500, రూ.7,400 చొప్పున నగదు డ్రా చేసుకున్నాడని తెలుసుకుని హతాశుడయ్యాడు. మోసానికి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

దాతృత్వానికి అభినందనలు



బెడ్లు అందజేస్తున్న సుదర్శన్, మున్నాలు

కనిగిరి రూరల్: మాజీ ఎమ్మెల్యే దివంగత భూతలపల్లి రామసుబ్బారెడ్డి ద్వితీయ అల్లుడు, స్థానిక సుదర్శన్ థియేటర్ యజమాని కూరపాటి శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో మరణించారు. వారి జ్ఞాపకార్థం వారి కుమారులు సుదర్శన్ (బుజ్జి), మున్నాలు కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు రూ.25000 విలువైన అత్యవసర విభాగమునకు ఉపయోగపడే బెడ్డును అందజేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ అందించారు. కార్యక్రమంలో వైద్యులు పిడుగు మురళికృష్ణ, న్యాయవాది సుమైర్, హెడ్ నర్సు, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే బుర్రా



శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కనిగిరి రూరల్: పట్టణంలో ఆకస్మికంగా మరణించిన వారి ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్ మంగళవారం సందర్శించారు. కనిగిరి పాతూరులో మాజీ ఎమ్మెల్యే భూతలపల్లి రామసుబ్బారెడ్డి అల్లుడువ సుదర్శన్ థియేటర్ యజమాని కూరపాటి శ్రీనివాసరెడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. వారి ఇంటికి వెళ్లి ఆయన కుమారులను, కుటుంబసభ్యులైన మాలకొండారెడ్డి, భూతలపల్లి శ్రీనివాసులరెడ్డిలను పరామర్శించారు. బుర్రా మాట్లాడుతూ మంచి వ్యక్తి ఎప్పుడు ఆనందంతో ఆహ్వానించే వ్యక్తిని కోల్పోయామన్నారు. ఇందిరా కాలనీకి వెళ్లి తవ్వా రాజేంద్రను వారి తల్లిదండ్రుల కుటుంబాన్ని కలిసి కరెంట్ తీగ తగిలి ప్రమాదవశాత్తు రాజేంద్ర కుమారుడు మరణించిన నేపథ్యంలో వారిని పరామర్శించారు. ఇటీవల ఆకస్మికంగా మరణించిన తిప్పలూరు పాపిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో ఇటీవల తొందర పాటు చర్యతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న షేక్ ఉస్మాన్ కుటుంబాని పరామర్శించి వారికి సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట చైర్మన్ అబ్దుల్ గఫూర్, రంగనాయకులురెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళి, రామనబోయిన శ్రీనివాసులు, ధనుంజయ, భవనం కృష్ణారెడ్డి, తిరుపతయ్య, నాగూర్‌బీ, భారతీ, డాక్టర్ రసూల్ తదితరులు ఉన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు ప్రభుత్వం అండ

- ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

మర్రిపూడి: ఫ్లోరోసిస్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని మర్రిపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని ధర్మవరం, వేమవరం, రావిళ్లవారిపాలెం తదితర గ్రామాల్లో ఫ్లోరిసిస్‌తో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న 18 మందిని గుర్తించగా వారిలో 15 మందికి ట్రైసైకిళ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా ఫ్లోరోసిస్‌తో బాధపడుతుంటే వారి అవసరాలు తెలుసుకుని పరికరాలు ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే వైద్యశాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.1.50 లక్షల నిధులు విడుదల చేసిందని, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, ల్యాప్‌టాప్, ఇన్వర్టర్ తదితర అవసరాల నిమిత్తం నిధులు వినియోగించాలని సూచించారు. వైద్యశాలల్లో ఇప్పటి వరకు 8 కాన్పులు చేయడం అభినందనీయన్నారు. రోగులకు నిత్యం అందుబాటులో ఉండి మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఎలాంటి అవసరాలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం 15 మందికి ఎంపీపీ చేతులమీదుగా ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.భాస్కర్, అంకేపల్లి సర్పంచ్ బి.తిరుపతమ్మ, వైద్యాధికారిణి సంగీత, కోఆప్షన్ మెంబర్ కోంద్రు ఇజ్రాయిల్, సీహెచ్ఓ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

సీఎస్‌పురం (పామూరు): సంక్షేమ పథకాల అమల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు కదిరి బాబూరావు అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కదిరి మాట్లాడుతూ సీయం జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రజాసంకల్ప పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో గ్రామాలు పర్యటించి నేరుగా ప్రజల కష్టాలు తెలుసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలన్నీ ఎంతో సుందరంగా తీర్చిదిద్దారన్నారు. వివిధ వర్గాల ప్రజలకు ఆర్థికంగా చేయూతనివ్వాలనే ధ్యేయంతో జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, కాపునేస్తం, ఈబీసీనేస్తం, పొదుపుమహిళలకు రుణమాఫీ తదితర పథకాలను ప్రవేశపెట్టి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వలంటీర్లను నియమించి ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన 11 సర్టిఫికెట్లను ఉచితంగా అందించారని, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



మొక్క నాటుతున్న ఎంఈఓ నాగేంద్ర వదన్

జరుగుమల్లి: దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు సాగించిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఎందరో త్యాగధనులు పాల్గొన్నారని ఎంఈఓ బత్తుల నాగేంద్ర వదన్ పేర్కొన్నారు. మండలంలోని చిరికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రార్థనా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహనీయుల సేవలను గుర్తుంచుకుని, వారి బాటలో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వీవీ రమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంతి భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం భైరవకోనలో భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి భవన నిర్మాణానికి రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. రూ.10 లక్షల సొంతనిధులతో చింతలచెరువు సత్యనారాయణరెడ్డి నిర్మించనున్న భవనానికి అర్చకులు రామ్మూర్తిశర్మ, సుధాకర్‌శర్మల వేదమంత్రాలతో భూమిపూజ చేశారు. అనంతరం జలపాతాన్ని సందర్శించి భైరవేశ్వరుడు, త్రిముఖదుర్గాదేవి, నగరేశ్వరుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన్ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించగా అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. దేవస్థాన ట్రస్టు మాజీ వైస్ చైర్మన్ సిద్ధు వెంకటరెడ్డి, హెచ్ఎంపాడు సర్పంచ్‌లు రవీంద్రరెడ్డి, రామ సత్యనారాయణరెడ్డి, తమ్మినేని ఫణీంద్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొదలైన నామినేషన్ల ప్రక్రియ

పీసీపల్లి: మండలంలో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. మంగళవారం ఎటువంటి నామినేషన్ల రాలేదని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల

హనుమంతునిపాడు: మండల పరిషత్‌కు మొదట విడతగా 15వ ఆర్థిక సంఘ నిధులు రూ. 15.58 లక్షలు విడుదలైనట్లు ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులు మండల పరిషత్ బ్యాంక్ ఖాతాలో జమయ్యాయన్నారు.

బీఎల్వోలకు ఓటర్లు సహకరించాలి

- ఈఆర్ఓ నారదముని

కొండపి: సమగ్ర ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు బీఎల్వో ఎదుట హాజరుకావాలని ఈఆర్ఓ బి.నారదముని కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్ఓ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటరు సర్వేపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే సమయంలో అందుబాటులో లేని ఓటర్లను పిలిపించి బీఎల్వో ఎదుట హాజరయ్యేలా చూడాలన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు బీఎల్ఓల వద్ద ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మరణించిన ఓటర్ల వివరాలు తెలియజేయడంతోపాటు ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. సమావేశంలో 6 మండలాల తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.